# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 19 సంచిక : 157 సోమవారం 09, ఫిబ్రవరి 2026 పేజీలు : 06 వెల : రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## భారత్–మలేషియా బంధానికి తమిళమే వారధి

**భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ**
**ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం**
**మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ**
**మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం**
**మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక ...మిగతా 2లో

## ఆకాశంలోకి దూసుకెళ్లనున్న 'రుద్రమ' రాకెట్..

**ఓరుగల్లులో తొలి మోడల్ రాకెట్ ప్రయోగం**
**'రుద్రమ' రాకెట్‌కు రాణి రుద్రమదేవి పేరు**
**విద్యార్థులకు సైన్స్ అవగాహన సదస్సు**
**భద్రకాళి ట్యాంక్ బండ్‌పై స్టార్ గేజింగ్ ఏర్పాట్లు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
వరంగల్ చారిత్రక నగర కీర్తి కిరీటంలో మరో మణిహారం చేరబోతోంది. విద్యా, సాంస్కృతిక కేంద్రంగా వెలుగొందుతున్న ఓరుగల్లు గడ్డపై మొట్టమొదటిసారిగా ఒక మోడల్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ...మిగతా 2లో




## ఆ రికార్డులు అక్కడ లేవు

**హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం**
**'ఓటుకు నోటు' కేసు ఆధారాలు కాలిపోయాయన్నది అసత్యం**
**సాక్ష్యాలన్నీ 2021లోనే కోర్టుకు ఇచ్చామన్న డైరెక్టర్ శిఖా గోయల్**
**ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన మెటీరియల్స్ కూడా సురక్షితం**
**కొన్ని డాక్యుమెంట్లు మాత్రమే కాలిపోయాయని, డేటాకు నష్టం లేదని స్పష్టీకరణ**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
ఈ నెల 7న.. నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ కేసులకు సంబంధించిన ఆధారాలు మొత్తం కాలిపోయాయని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖాగోయల్ స్పష్టం చేశారు. 2024 పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో 136 మెటీరియల్స్ ఎఫ్ఎస్ఎల్‌కు వచ్చాయన్న ఆమె.. ఇందులో 7 మెటీరియల్స్ తాజా ప్రమాదంలో ...మిగతా 2లో





## అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం..

**నమ్మి ఓటేశారంటే నెత్తిన భస్మాసుర 'హస్తం'**
**చరిత్రలో రేవంత్ అంత చెత్త సీఎం ఎవరూ లేరన్న కేటీఆర్**
**బూతులు మాట్లాడటం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదని ఆరోపణ**
**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
తాండూర్ పురపాలక సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. ప్రచారంలో భాగంగా ఆదివారం తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తో రోడ్ షో,అనంతరం ఇందిరా చౌక్ కూడలిలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు తాండూర్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను, తాండూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను ఉద్దేశించి సభాముఖంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ...గత రెండేళ్ల క్రితం ఆరు గ్యారెంటీ పథకాలు అమలు అవుతాయని ఆశతో ఒక్క ఓటు వేసి శిక్ష ఐదేళ్లు అనుభవిస్తున్నారని అన్నారు. ఒక్కసారి మోసంపోతే ...మిగతా 2లో

# ఏ జిల్లానూ రద్దు చేయం

**జిల్లాల రద్దు ప్రచారానికి సీఎం ఫుల్ స్టాప్**
**కొత్త జిల్లాల ఏర్పాటు లేదని స్పష్టీకరణ**
**జిల్లాల పునర్విభజనపై విష ప్రచారాలు నమ్మొద్దు**
**ఒకవేళ చేయాల్సి వస్తే ప్రజామోదం, ప్రతిపక్షాల సలహాలు తీసుకుంటాం**
**సింగరేణి మెడికల్ బోర్డు ఆలోచన లేదు**
**కేసీఆర్, కేటీఆర్, హరీస్ రావును అరెస్టు చేసే వరకు కిషన్ రావే**
**కాళేశ్వరం అవినీతి కేసులో కేసీఆర్ కు రక్ష**
**బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలకు దెబ్బకు దెబ్బ కొడతాం**
**మీ తాతలు, ముత్తాతలను తీసుకువచ్చినా భరతం పడతాం**
**ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తాం**
**వచ్చే బడ్జెట్ లో ఇందిరమ్మ రెండో విడత ఇండ్లు మంజూరు చేస్తాం**
**భూపాలపల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాను తొలగించడం కానీ కొత్త జిల్లా ఏర్పాటు చేసే ఆలోచన తమ ప్రభుత్వ పరిశీలనలో లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎప్పుడైనా జిల్లాల పునర్విభజనపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే బహిరంగంగా ప్రజలకు చెప్పి, శాసనసభలో చర్చించి ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాతే జిల్లాలపై ఆలోచన చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ పార్టీ రద్దు చేయబోతోందని ఇటీవల ...మిగతా 4లో



## రోదసిలోనూ గూఢచర్యం...

**అంతరిక్షంలో నిఘా సామర్థ్యం సాధించిన భారత్**
**అహ్మదాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఆజిస్టా అరుదైన ఘనత**
**అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఫొటో తీసిన స్వదేశీ ఉపగ్రహం**
**జాతీయ భద్రత, ఉపగ్రహాల రక్షణలో ఇది కీలక ముందడుగు**
**భవిష్యత్తులో బాలిస్టిక్ క్షిపణుల ట్రాకింగ్ కూడా సాధ్యం**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
అంతరిక్ష రంగంలో భారత ప్రైవేట్ సత్తా మరోసారి ప్రపంచానికి తెలిసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఉపగ్రహంతో అంతరిక్షంలోని ఇతర వస్తువులను అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి అహ్మదాబాద్‌కు చెందిన ఆజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అరుదైన ఘనత సాధించింది. ఈ విజయంతో భారత్‌కు 'ఇన్‌ఆర్బిట్ స్నూపింగ్' (కక్ష్యలోనే గూఢచర్యం) చేసే సామర్థ్యం లభించినట్లయింది. అంటే, ఇకపై ...మిగతా 2లో

## అన్నం పెట్టినోళ్లకు సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా..

**ఒక్కో వృద్ధుడికి రూ.52వేలు కాంగ్రెస్ బాకీ**
**మేం అన్నం పెడితే.. కాంగ్రెస్ మీకు సున్నం రాస్తుంది**
**హామీలు ఎగ్గొట్టిన నువ్వే అసలైన 'నకిలీ'**
**మాట నిలబెట్టుకున్న కేసీఆర్ అసలీ**
**సదాశివపేటలో అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**




## పోలీసు వృత్తి సామాజిక బాధ్యత

**అప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజల్లో గౌరవం పెరుగుతుంది**
**సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలి**
**బాధితులకు భరోసా అసలైన విజయం**
**నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం రివార్డులు ...మిగతా 4లో



## జ్యుడీషియల్ విచారణ జరపాలి

**ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రేనని కేటీఆర్ ఆరోపణ**
**'ఓటుకు నోటు' కేసు సాక్ష్యాలను నాశనం చేసేందుకే ఈ ఘటన అన్నారు**
**ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్**
**వేలాది క్రిమినల్ కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయని ఆందోళన**




హైదరాబాద్, (ప్రజాస్వరం):
హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో (ఎఫ్ఎస్ఎల్) శనివారం జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్ర పన్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత ఘటనే అని ...మిగతా 2లో

# అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం..

**మొదటిపేజీ తరువాయి**

తప్పిదం అంటారు, రెండోసారి మోసం పోతే తెలివి తక్కువ దద్దమ్మలు అంటారు అని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితమే మోసపోయాం మళ్లీ ఇప్పుడు మోసపోకుండా తెలివి ప్రదర్శిస్తూ ముళ్ళును ,ముళ్ళు తోనే తీయాలని సామెత ఎలా ఉందో, మోసమును, మోసంతోనే జయించే అవకాశం మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిందన్నారు. తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆరు గ్యారెంటీల హామీల గాలిలో కొట్టుకొచ్చారని, తిరిగి వెళ్ళిపోయే నాయకుడు అన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా, అందుబాటులో ఉండే యువ నాయకుడు తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తాండూర్ అభివృద్ధికి రూ.1680 కోట్ల నిధులు సమకూర్చి, తాండూర్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేశారన్నారు. కొంతమంది దుష్టశక్తుల కారణంగా 2023 శాసనసభ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయినప్పటికీ, అనునిత్యం తాండూర్ ప్రజలకు సేవ చేసుకుంటూ మీతోనే ఉంటూ, కేసీఆర్ నాయకత్వంలో చురుకుగా పాల్గొంటున్నారు. తాండూర్ కు రాబోయే రోజుల్లో తాండూర్ పైలెట్ రోహిత్ రెడ్డి అడ్డగా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

**హామీలు కొండత.. అమలు రవ్వంత**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు 2023 ఎన్నికల్లో ప్రజలను ఆరు గ్యారంటీల అభయహస్తం అరచేతిలో పెట్టుకొని తిరుగుతూ, మాయ మాటలు ప్రసంగిస్తూ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి, రెండేళ్ల ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల అమలులో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి పై ఒత్తిడి తీసుకురావాలని విమర్శించారు. సభాముఖంగా ఒక్క మాట కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇచ్చినట్లయితే చెయ్యి గుర్తుకే ఓటెయ్యండి.. లేని యెడల కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు తోఫా, క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుక, ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడే బతుకమ్మ చీరలు పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టిన పథకాలను కేసీఆర్ కిట్టు లో భాగంగా మగ బిడ్డ జన్మిస్తే రూ.12,000, ఆడపిల్ల జన్మిస్తే రూ.13 వేలు అందేవి, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేసీఆర్ పథకాలను నిరుపేదలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆరు నెలలైనా రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో ఇంకా జమ కాలేదని, సన్న రకం వడ్లు పండిస్తే మద్దతు ధరతో పాటు, అదనంగా రూ. 500 బోనస్ కల్పిస్తామని ఎన్నికల్లో హామీ కల్పించి, రెండేళ్లగా సన్న రకం వడ్లు పండించిన రైతులకు బోనస్ ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి సర్కార్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున 70 సర్పంచ్ స్థానాలు గెలిచి చూపించామని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 36 స్థానాలకు అత్యధికంగా గెలుపొంది, మున్సిపల్ పై గులాబీ జెండా ఎగురవేస్తే, తాండూర్ లో ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఖేల్ ఖతం అవుతుందని పేర్కొన్నారు.

**జీవో విడుదల చేసే దమ్ముందా..**

గత బిఆర్ఎస్ పాలనలో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి చొరవతో , మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాండూర్ కు మెడికల్ కళాశాల మంజూరు చేశారని, కాగా సీఎం రేవంత్ రెడ్డి తాండూర్ విద్యావంతులకు, ప్రజలకు నిలువెత్తు మోసం చేస్తూ తాండూర్ పేరు పై ఉన్న మెడికల్ కళాశాలను కొడంగల్ కు తరలించడం విడ్డూరం. అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే కాకుండా, సొంత ఇలాకా ప్రజలనే దౌర్జన్యం చేస్తూ.. తాండూర్ పేరిట ఉన్న మెడికల్ కాలేజీ ను కొడంగల్ కు తరలించడం సబాబు కాదని, అందుకోసం తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం అండగా నిలుస్తుందని సభాముఖంగా తెలియజేశారు. ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల లోపు దమ్ముంటే తాండూర్ లో ఉన్న మెడికల్ కాలేజ్ భవనం , తాండూర్ కే సంబంధించినదని జీవో విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

పైలెట్ పక్కా లోకల్ బిడ్డగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అరచేతిలో ఆరు గ్యారెంటీల అభయహస్తం కార్డుతో తాండూర్ ప్రజలను మోసం చేస్తూ.. గెలిచిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఎలా వచ్చారు అదే దారిలో వెళ్లిపోవడం ఖాయమని మండిపడ్డారు. మీ బిడ్డగా, మీ ఇంటి అన్నగా, పెద్ద మనిషిగా తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నిరంతరం ప్రజాసేవకే,తాండూర్ అభివృద్ధికి తోడ్పడుతాడని నేను తాండూర్ ప్రజలకు సభా ముఖంగా భరోసా కల్పిస్తున్నానని రానున్న రోజుల్లో తాండూర్ అడ్డా పైలెట్ రోహిత్ రెడ్డి అడ్డగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీశైల్ రెడ్డి, వికారాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థల చైర్మన్ రాజు గౌడ్, తాండూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాస్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, 36 వార్డుల బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆకాశంలోకి దూసుకెళ్లనున్న 'రుద్రమ' రాకెట్..

**మొదటిపేజీ తరువాయి**

28న నిర్వహించ తలపెట్టిన ఈ అద్భుత ఘట్టం, అటు విద్యార్థుల్లో ఇటు సామాన్య ప్రజల్లో అంతరిక్ష విజ్ఞానంపై సరికొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇస్రో స్పేస్ ట్యూటర్ , ఏటీడీఆర్ఎల్ వ్యవస్థాపకుడు శశాంక్ భూపతి నేతృత్వంలో రూపొందిన ఈ ప్రాజెక్టుకు వరంగల్ నిట్ , కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నాయి.

కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి సాహసానికి ప్రతీకగా ఈ మోడల్ రాకెట్‌కు 'రుద్రమ' అని నామకరణం చేశారు. ఫిబ్రవరి 28వ తేదీన హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానం ఈ చారిత్రక ప్రయోగానికి వేదిక కానుంది. ఈ ప్రయోగానికి ముందు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సైన్స్ , అంతరిక్షంపై విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహిస్తారు. ఈ సదస్సు ముగిసిన వెంటనే 'రుద్రమ' రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి , భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల వైపు వారిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

కేవలం రాకెట్ ప్రయోగంతోనే ఆగకుండా, ఖగోళ ప్రియుల కోసం మరిన్ని ఆసక్తికరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15వ తేదీ నుండి 27వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు భద్రకాళి ట్యాంక్ బండ్‌పై ప్రత్యేకంగా టెలిస్కోపులను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా నక్షత్రాలను, గ్రహాలను వీక్షించే (స్టార్ గేజింగ్) అరుదైన అవకాశం నగరవాసులకు కలుగుతుంది. ఈ కార్యక్రమాలన్నింటిలో పాల్గొనేందుకు పాఠశాల , కళాశాల విద్యార్థులకు, అలాగే ఆసక్తి గల వారికి ప్రవేశం పూర్తిగా ఉచితం. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో జరుగుతున్న ఈ వేడుకలు నగరంలో సైన్స్ పట్ల సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి.




# అన్నం పెట్టినోళ్లకు ఓటేద్దామా.. సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా..

- ఒక్కో వృద్ధుడికి రూ.52వేలు కాంగ్రెస్ బాకీ
- మేం అన్నం పెడితే.. కాంగ్రెస్ మీకు సున్నం రాస్తుంది
- హామీలు ఎగ్గొట్టిన నువ్వే అసలైన 'నకిలీ'
- మాట నిలబెట్టుకున్న కేసీఆర్ అసలీ
- సదాశివపేటలో అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

అన్నం పెట్టినోళ్లకు ఓటేద్దామా.. సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ జిల్లా సదాశివపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సదాశివపేటలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అనిపిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ సర్కార్ చేసిందేమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. భార్యకు బస్సు ఫ్రీ ఇచ్చి.. భర్తకు డబుల్ టికెట్ ఇచ్చాడని అన్నారు. ఏం మంచి పని చేశామని ఓట్లు వేయమని అడుగుతారని ప్రశ్నించారు. రేవంత్ నోటి వెంట బూతులు తప్ప మంచిమాటలు రావడం లేదని మండిపడ్డారు. రూ.4వేల పింఛన్ ఇవ్వలేదు.. ఒక్కొక్కరికీ రూ.52వేలు బాకీ పడ్డారని అన్నారు. అవ్వాతాతలు మీకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు రూ.52 వేలు ఇవ్వాలని నిలదీయాలని సూచించారు.

సదాశివపేట, సంగారెడ్డిలో మంచి ఆస్పత్రులు కట్టామని హరీశ్‌రావు తెలిపారు. బిడ్డ పుడితే రూ.13 వేలు ఇచ్చి అంబులెన్స్‌లో జాగ్రత్తగా ఇళ్ల వద్ద దించామని పేర్కొన్నారు. సదాశివపేటలో మంచినీటి కష్టాలు తీర్చింది కేసీఆర్ అని తెలిపారు. కల్యాణలక్ష్మీ కింద ఆడబిడ్డల పెళ్లి రూ.లక్ష ఇచ్చామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తులం బంగారం ఇస్తానని చెప్పిండని.. ఇంతవరకూ ఇచ్చిండా అని ప్రశ్నించారు. ఏ ఒక్కరికైనా తులం బంగారం వచ్చిందా అని నిలదీశారు.

డబ్బులు ఇచ్చి కాంగ్రెసోళ్లు ఓట్లు పెట్టించుకుంటారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెసోళ్లు రూ.5వేలు ఇచ్చిండ్రు.. ఓటు మాత్రం కారుకు వేస్తానని ఓ వృద్ధురాలు చెప్పిందని పేర్కొన్నారు. 50 పడకల ఆస్పత్రి కట్టామని.. కొత్త బస్టాండ్ కూడా కట్టించామని చెప్పారు. సదాశివపేటలో రూ.250 కోట్ల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గోసపడదామా అని ప్రశ్నించారు. గొర్రె పిల్లల పథకం, చేప పిల్లల పథకం బంద్ అయ్యిందని చెప్పారు. కేసీఆర్ కిట్ బంద్.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ అయ్యిందని అన్నారు. కేసీఆర్ పథకాలన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డి బంద్ పెడుతున్నాడని తెలిపారు. అన్ని పథకాలు బంద్ పెట్టి గోసపెడుతున్న రేవంత్‌కు ఓట్లేద్దామా అని ప్రశ్నించారు.

కాంగ్రెసోళ్లు బట్టేబాజ్ మాట్లాడుతుండ్రు అని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక స్పెషల్ ప్యాకేజీ తెచ్చి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. సదాశివపేట సమస్యలన్నీ బాగు చేయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. బస్తీ దవాఖానాలు, వీధిలైట్లు, రోడ్లు, పార్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్ల స్మశానవాటికలకు రూ.5 ఎకరాల చొప్పున ఇచ్చామని పేర్కొన్నారు. పట్టణాల్లో చెత్త ఎత్తని ముఖ్యమంత్రి, చెత్త మాటలు మాట్లాడుతుండని మండిపడ్డారు. లాగుల తొండలు వదులుతా.. పేగులు తీసి మెడలో వేసుకుంట.. గుడ్లు పీకి గోటీలాడుతా అని అంటున్నారని తెలిపారు. ఇలాంటి భాషనా ఓ ముఖ్యమంత్రి మాట్లాడేదని మండిపడ్డారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలను మోసం చేసిండని హరీశ్‌రావు మాట్లాడారు. ఏ ఒక్కరినీ వదలకుండా అన్ని వర్గాలనూ మోసం చేసిండని మండిపడ్డారు. డిక్లరేషన్లు మరిచిపోయిండు అని.. బూతుల డిక్లరేషన్లు చేసిండని తెలిపారు. ఈ బూతుల ముఖ్యమంత్రి ఓటుతో గట్టి బుద్ధి చెప్పాలని సూచించారు. చెత్త మాటలు వద్దు.. అభివృద్ధి కావాలంటూ ఓటుతో తెలియజెప్పాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ గెలిపించుకోండని.. మీ సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత నాది అని స్పష్టంచేశారు.

# జ్యుడీషియల్ విచారణ జరపాలి

**మొదటిపేజీ తరువాయి**




ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివారం నాడు హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఓటుకు నోటు' కేసు తుది తీర్పు దశకు చేరుకున్న సమయంలో, సాక్ష్యాలను శాశ్వతంగా నాశనం చేయాలనే దురుద్దేశంతోనే ఈ ప్రమాదాన్ని సృష్టించారని అన్నారు. అత్యంత భద్రత ఉండే ల్యాబ్‌లో, అదీ శీతాకాలంలో మంటలు చెలరేగడం, 24 గంటలూ సిబ్బంది ఉండాల్సిన చోట ఎవరూ లేకపోవడం వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

"ప్రారంభంలో స్వల్ప నష్టమే జరిగిందని అధికారులు చెప్పారు. కానీ ఆ తర్వాత 2015 నుంచి పదేళ్ల విలువైన సాక్ష్యాధారాలు పూర్తిగా కాలిపోయాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం కుట్ర అనే అనుమానాన్ని బలపరుస్తోంది" అని కేటీఆర్ వివరించారు. కేవలం ఒక అంతస్తుకు పరిమితమైన మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనలో దాదాపు 50 కంప్యూటర్లు, సర్వర్లు, డిజిటల్ రికార్డులు కాలిపోయాయని ఆరోపించారు.

ఈ ప్రమాదంలో వేలాది తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా ధ్వంసమయ్యాయని, ఇది ప్రజా భద్రతకు పెను ముప్పు అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దల అండతోనే ముఖ్యమంత్రి ఇదంతా చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, వారు సీఎంకు ప్రైవేట్ సైన్యంలా పని చేస్తున్నారని విమర్శించారు. ఘటనపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, అఖిలపక్ష బృందాన్ని ఎఫ్ఎస్ఎల్ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అనుమతించాలని కోరారు.

# ఆ రికార్డులు అక్కడ లేవు

**మొదటిపేజీ తరువాయి**




కాలిపోయాయని చెప్పారు. అయితే వీటిని రిట్రైవ్ చేస్తున్నామని చెప్పారు. మిగతావన్నీ సంబంధింత అధికారులకు అప్పగించామన్నారు. 2015లో ఏసీబీ నమోదు చేసిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన మెటీరియల్ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లో లేదన్నారు. ఈ కేసులో 2015లో రెండు విడతల్లో 16 మెటీరియల్ ఆబ్జెక్టులు ఎఫ్ఎస్ఎల్‌కు అందాయని అదే ఏడాది వాటి నివేదికలను ఏసీబీ కోర్టుకు సమర్పించినట్టు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన 16 వస్తువులు ఇప్పటికే కోర్టుకు తిరిగి అప్పగించినట్టు తెలిపారు. ప్రమాదం జరిగిన ఫోరెన్సిక్ లాబొరేటరీస్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉదయం 10.08 గంటలకు ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ అగ్నిప్రమాదంపై విచారణ జరుగుతోందనీ... జరిగిన ఆస్తినష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారని ఆమె చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్న ఆమె.... అగ్నిప్రమాదం సమయంలో ఎవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. నష్టం అంచనాకు వచ్చాక వివరాలు వెల్లడిస్తామన్నారు. మంటలను మొదట ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగి ఒకరు గుర్తించారని చెప్పారు. ల్యాబ్, ట్రైనింగ్ హాల్‌కు మంటలు వ్యాపించాయని చెప్పారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తే సాధ్యపడలేదన్నారు. మొదట ప్రాపర్టీ రూమ్‌లో పొగ, మంటలు చెలరేగాయని ఆ తర్వాత లైబ్రరీ, హెచ్ఆర్ డీ రూమ్‌కు వ్యాపించాయని వెల్లడించారు.సున్నం పూసినోళ్లకు ఓటేద్దామా..

# భారత్‌మలేషియా బంధానికి తమిళమే వారధి

**మొదటిపేజీ తరువాయి**

జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు.



మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

# రోదసిలోనూ గూఢచర్యం...

**మొదటిపేజీ తరువాయి**

అంతరిక్షంలో శత్రు దేశాల ఉపగ్రహాలపై నిఘా పెట్టడం సాధ్యమవుతుంది.

ఆజిస్టా సంస్థకు చెందిన 80 కిలోల బరువున్న AFR (ఏబిఏ ఫస్ట్ రన్నర్) ఉపగ్రహం ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఫిబ్రవరి 3న భూమికి సుమారు 300 కిలోమీటర్లు, 245 కిలోమీటర్ల దూరంలో పరిభ్రమిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)ను ఈ ఉపగ్రహం రెండుసార్లు ఫొటోలు తీసింది. మొత్తం 15 ఫ్రేమ్‌లను సేకరించగా, ఇమేజ్ రిజల్యూషన్ దాదాపు 2.2 మీటర్లుగా నమోదైంది. ఈ రెండు ప్రయత్నాల్లోనూ 100 శాతం విజయం సాధించడం, ఆజిస్టా అభివృద్ధి చేసిన స్వదేశీ ట్రాకింగ్ అల్గారిథమ్‌లు, ఎలక్ట్రోఆప్టికల్ ఇమేజింగ్ వ్యవస్థల కచ్చితత్వాన్ని నిరూపించింది.

ప్రస్తుతం భూ కక్ష్యలో ఉపగ్రహాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. జామింగ్, సిగ్నల్స్‌కు అంతరాయం కలిగించడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్పేస్ సిచువేషనల్ అవేర్‌నెస్ (SSA) సామర్థ్యం దేశ భద్రతకు అత్యంత కీలకం. భారత్ ప్రస్తుతం కమ్యూనికేషన్, నావిగేషన్, వ్యూహాత్మక అవసరాల కోసం రూ.50,000 కోట్లకు పైగా విలువైన 50కి పైగా ఉపగ్రహాలను నిర్వహిస్తోంది. ఈ తాజా సామర్థ్యంతో మన అంతరిక్ష ఆస్తులను కాపాడుకోవడం సులభతరం అవుతుంది.

AFR ఉపగ్రహాన్ని 2023 జూన్ 13న స్పేస్‌ఎక్స్ ఫాల్కన్9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ శాటిలైట్ ఇప్పటికే 2.5 సంవత్సరాల జీవితకాలాన్ని పూర్తి చేసుకుని, మరో 2.5 ఏళ్లు పనిచేయనుంది. ఈ విజయంపై ఆజిస్టా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "మా స్వదేశీ వ్యవస్థలతో నాన్‌ఎర్త్ ఇమేజింగ్‌ను ప్రదర్శించాం. ఇది కక్ష్యలోని వస్తువులను కచ్చితంగా ట్రాక్ చేసే సామర్థ్యాన్నిస్తుంది" అని తెలిపారు.



ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రిగేడియర్ అదర్శ్ భారద్వాజ్ మాట్లాడుతూ, "ఈ ప్రదర్శనతో అంతరిక్షంలో కార్యకలాపాలను పర్యవేక్షించే శక్తి భారత్‌కు లభించింది. జాతీయ ఆసక్తులను కాపాడటంలో ఇది కీలక ముందడుగు" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌తో ఫొటోలు తీయగల పేలోడ్‌లను అభివృద్ధి చేస్తామని, బాలిస్టిక్ క్షిపణులను ట్రాక్ చేయడం వంటి రక్షణ అవసరాలకూ ఇది ఉపయోగపడుతుందని ఆజిస్టా ప్రకటించింది. ఇస్రో ప్రయోగాలకు అదనంగా, ప్రైవేట్ రంగం సాధించిన ఈ విజయం భారత అంతరిక్ష రక్షణ సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేసింది.

## నేదునూరి పిలుపు

# ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి పోటెత్తాలి

(తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలనేపథ్యంలో పట్టణ ఓటర్లను పోలింగ్ పట్ల చైతన్య పరుస్తూ రాసిన కవిత)


కరీంనగర్/హైదరాబాద్ (ప్రజాస్వరం)

ఫిబ్రవరి11పోలింగ్ రోజు
హాలీడే కాధు
ప్రజాస్వామ్య హాలీడే
పోలింగ్ బూతులోకి
ఓటర్లు పోటెత్తాలి
ప్రజాస్వామ్య స్ఫూర్తిని
చాటాలి
ఓటుతో వార్డు/ డివిజన్
పట్టణ ప్రగతిని శాసించాలి
మార్పు మాటల్లో కాదు
ఓటు వేసి మార్పు చూడాలి
ఓటుతో మార్పు తీర్పుకు
నీవే అగ్రేసరుడివి కావాలి
ఓటుతో కౌన్సిలర్ /
కార్పొరేటర్ ను ఆదేశించాలి
బుల్లెట్ కంటె బ్యాలెట్
బలమైంది
ఓటు పవర్ ను చాటాలి
ఓటుతో ఐదేళ్ల అభివృద్ధిని
నిర్దేశించాలి
ఓటుతో జాతి తల
రాతను మార్చు
మంచి నాయకత్వాన్ని
ఏర్చి కూర్చు
నయా వంచకులకు
తెరదించు
వార్డు/ డివిజన్/ పట్టణ
ప్రజల రక్షణ భద్రత ఉజ్వల
భవిష్యత్తుకు ఓటెయి
ఓటుతో విధ్వంస
విఛ్చిన్న పాలనకుకి
పాడాలి చరమ గీతం
ఓటు కావాలి ప్రగతికి
దారి దీపం
ఓటుతో పట్టణ పంచవర్ష
ప్రగతికి బాటలు వేయాలి
ఓటు విలువైన ఆయుధం
ఓటు విలువ తెలుసుకో
దేశ ప్రగతిని మార్చుకో
ఓటేయడం మానవద్దు
ఓటరు రాజకీయ పార్టీల
ఉచితాల ఊబిలో పడక
విజ్ఞతతో ఆలోచించు
సమర్దులను గెలిపించు
ప్రచార ఆర్భాటాల మధ్య
ప్రశాంతంగా ఆలోచించు
నిర్భయం ఓటెయ్యాలి
మేలెంచి మంచి వారిని
ఎన్నుకోవాలి
రాజ్యాంగ హక్కును
వృధా చేయవద్దు
ప్రలోభాలకు లొంగకు
అనర్హులకు ఓటు వేయకు
అభ్యర్థుల కుల మతాలు
కాదువారి అభిమతాలు
ముఖ్యం

నీ చూపుడు వేలితో
పాలకులను శాషించు
నోటుకు ఓటును అమ్ముకోకు

నీవు వేసే ఓటు
వార్డు/ డివిజన్ / పట్టణ
ప్రగతికి తొలి మెట్టు
విజ్ఞతతో ఆలోచించు
సమర్థులు గెలిపించు
ప్రజాసేవకులను ఎన్నుకో
అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు
ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే
వెలగబెట్టడం కాదు
ఇప్పటిదాక ఏమి చేశాడో
చూడు
నీ ఓటు నేరచరితులపై
కావాలి వేటు
బూతులు మాట్లాడే
నాయకులకు పోలింగ్
బూతులోనే ఓటుతో బుద్ది
చెప్పండి
పార్టీ ఫిరాయించిన వారిని
ఓటుతో ఓడించండి
నీతి నిజాయితీ
పరులకు పట్టం కట్టండి
చట్టం చేయని పని
ఓటర్లే చేయాలి
పిరాయింపుల
స్వామ్యాన్ని ఓటుతో
అడ్డుకోవాలి
ప్రగతి పురోగతిని కోరుకో
పల్లెల్లో పోలింగ్ జోరు
పట్నాలలో నగరాలలో
పోలింగ్ బేజారు
ఓటర్లు ఎండ వాన సెలవు
పేరున పోలింగుకు దూరం
కావద్దు
అసమర్థ అవినీతి
నాయకులను ఎన్నుకోవద్దు
ఓటర్లు నిర్లిప్తత నిరాశను వీడాలి
పోలింగ్ బూతుకు వెళ్ళాలి
ప్రజాస్వామ్య పండుగలో
ఓటుతో సందడి చేయాలి
ప్రజాస్వామ్య స్ఫూర్తిని
ప్రపంచ దేశాలకు చాటాలి
మంచి నాయకున్ని ఎన్నుకో
ప్రజాస్వామ్య విజయానికై
సాగిపో

నేదునూరి కనకయ్య
( నేదునూరి కళ్యాణ్)
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం ' సామాజిక
ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్
9440245771



# 13 వ వార్డు ప్రచారంలో దూసుకెళ్తున్నా సింహం...

**తూప్రాన్ ఫిబ్రవరి 8( ప్రజా స్వరం )**

తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు అభ్యర్థి డాక్టర్ జానకిరామ్ ఆల్ ఇండియా ఫెడరేల్ బ్లాక్ జాగృతి కవిత పార్టీ బలపరిచిన అభ్యర్థి సింహం గుర్తుకు ఓటు వెయ్యాలని తెలంగాణ రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ప్రచారం లో పాల్గొన్నారు సింహం గుర్తు తో ప్రచారం లో మహిళ లు భారీగా ర్యాలీ బతుకమ్మ అట పాటలు దుసుకెళ్లుతున్నారు జానకిరాం మాట్లాడుతూ "బ్యాలెట్ బుల్లెట్ కంటే శక్తివంతమయినది" అనే నినాదంతో ఓటు వేసే ప్రజలను ఉద్దేశించిఆయన మాట్లాడుతున్నారు.
ప్రజాస్వామ్యం అనేది ఓటు వేయడమే కాదు, గౌరవంగా జీవించే హక్కు కూడా జానకిరామ్ ప్రజలను తమ గొంతుక వినిపించడానికి, సమస్యలు పరిష్కరించడానికి ఓటు వేయాలని కోరుతున్నారు.ఓటు శక్తి ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దానిని సరైన దిశలో వినియోగించాలనిఆయన వివరించారు.
తనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో ప్రజలను ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రోత్సహిస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఓయూ నుండి నాయకులు హర్ష వర్ధన్ గౌడ్ హన్మంత్ గౌడ్ తలారి సతయ్య కృష్ణ గౌడ్ చిరంజీవి పూర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు




# యావపూర్ లో స్వచ్ఛభారత్

**తూప్రాన్ ఫిబ్రవరి 8 {ప్రజాస్వరం}**

తూప్రాన్ మండలంలోని యావపూర్ లో నేటి నుండి ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించేందుకు సర్పంచ్ యంజాల స్వామి యువత ముందుకు వచ్చారు గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకూడదని యువత తీర్మానం చేసుకున్నారు వచ్చే పాలకవర్గ సమావేశంలో చర్చించి గ్రామంలో బెల్ట్ నిర్వహిస్తే జరిమానా విధించే విధంగా తీర్మానం చేయనున్నట్లు సర్పంచ్ స్వామి తెలిపారు మద్యం అమ్మిన కొనుగోలు చేసిన వారిపై చర్యలు ఉంటాయనిఅన్నారు ఈ కార్యక్రమంలో కుత్తాడు మహేష్ సింహం నరసింహులు శ్రీనివాస్ బాలేష్ వెంకట్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు





# గ్రామ సభలో బయటపడ్డ ఈజీఎస్ అవకతవకలు...

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 8 (ప్రజా స్వరం)**

చిన్నశంకరంపేట మండలంలోని ఎస్ కొండాపుర్ గ్రామంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో పలు అవకతవకలు బయటపడ్డాయి. ఆదివారం గ్రామసభలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరాలు వెల్లడించారు. గ్రామంలో లేనివాళ్లు కూడ పనులు నిర్వహించినట్లు హజరు వేసినట్లు గుర్తించారు. అలాగే ఆనారోగ్యంతో ఇంటికే పరిమితమైన వారి పేరున కూడ పనులు చేసినట్లు రికార్డు చేసి డబ్బులు డ్రా చేసినట్లు సామాజిక తనిఖీ డీఆర్పీ వెల్లడించారు. ఒక దశలో గ్రామస్తులు బహిబహికి సిద్ధపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

# మేడ్చల్ సిపిఐ ఇన్చార్జ్ తోటపల్లి శంకర్

**జవహర్ నగర్, జనవరి8,(ప్రజాస్వరం):**

ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జి తోటపల్లి శంకర్ అన్నారు. ఆదివారం సిపిఐ కాప్రా మండల కౌన్సిల్ సమావేశం జవహార్ నగర్ దళిత సంక్షేమ భవన్లో కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలు జాతీయ ఆస్తులు మరియు అవసరమైన ప్రజా సేవల ప్రైవేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన లేబర్ కోడ్లను వ్యతిరేకంగా సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఫలితంగా ఉద్యోగాలు కోల్పోవడం కార్మిక హక్కులను హరించే వేయడం మరియు సామాజిక భద్రత నిరాకరణ యువత మరియు శ్రామిక ప్రజలకు తీవ్రంగా దెబ్బతీసిందన్నారు కష్టపడి సాధించుకున్న కార్మిక హక్కులను పలుచన చేసిన కార్మిక సంఘాలను బలహీనపరిచి వ్యాపారం చేయడం సులభతరం పేరుతో సంస్కగతమైన దోపిడీకి కారణమైన నాలుగు కార్మిక లేబర్ కోళ్లను వెంటనే రద్దు చేయాలని (సిపిఐ) ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తుందన్నారు ఈ లేబర్ కోడ్లు ఉద్యోగ భద్రత న్యాయమైన వేతనాలు మరియు సురక్షితమైన పని పరిస్థితులను అరిస్తున్నాయని ముఖ్యంగా యువకులకు కాంట్రాక్ట్ కార్మికులకు నష్టాదాయకమన్నారు .ఈ నెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సాహిత్య సమ్మెలు నియోజకవర్గంలోని కార్మిక, ప్రజా సంఘాలు భారీ ఎత్తున మీ సమ్మెలో పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల ,లత వి స్వరూప నాయక్, ఏఐటిసి మండల అధ్యక్షులు ఏ ఎల్లయ్య,గిరి ప్రసాద్ నగర్ సిపిఐ కార్యదర్శి కొండా సత్యం సాగర్, రైతు సంగం నాయకులు పి నరసింహ, మహిళా సమైక్య నాయకురాలు డి మల్లిక, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# దేవరకద్ర మున్సిపాలిటీ మినిగొని పల్లి గ్రామంలో జోరుగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర ఫిబ్రవరి 8 (ప్రజాస్వరం):**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మినిగొని పల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జోగి గోవింద్ గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం మినిగోని పల్లి గ్రామ అభివృద్ధిని పట్టించుకోలేదని, గ్రామంలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని, మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే మినిగోని పల్లి గ్రామానికి 80 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, వాటితోపాటు గ్రామ అభివృద్ధికి 35 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. గత పదేళ్లు పాలించిన కెసిఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేశారని, కెసిఆర్ చేసిన అప్పులకు మిత్తిలు కట్టుకుంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను, నెరవేరుస్తున్నామన్నారు, అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 500 లకే సీలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, రెండు లక్షల రుణమాఫీ చేశామని, దేశంలో ఎక్కడ లేని విధంగా ఏడాదికి 13 వేల కోట్లు వెచ్చించి రేషన్ పై సన్న బియ్యం ఇస్తున్నామని తెలియజేసారు. దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే, అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేద్దామని ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే జియంఆర్ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసా కోసం ప్రభుత్వ కసరత్తు

- **నిధుల కోసం బహిరంగ మార్కెట్ నుంచి రూ.9,000 కోట్ల రుణం**
- **ఈ నెల 10న ఆర్బీఐ ద్వారా నిధుల సమీకరణకు ప్లాన్**
- **మున్సిపల్ ఎన్నికల తర్వాతే నిధులు జమ చేస్తామన్న సీఎం రేవంత్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈవేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈవేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం. అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.




## వార్డు ఒక్కటే.. అభ్యర్థుల పేర్లూ ఒక్కటే

- **శంకర్‌పల్లి ఎన్నికల్లో వింత పోరు!**

**శంకర్ పల్లి ఫిబ్రవరి**

06(ప్రజాస్వరం):రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పురపాలిక ఎన్నికల్లో ఒక అరుదైన, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, ఒకే పేరుతో, ఒకే వార్డు నుంచి ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. రెండో వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఒకరు, భారాస తరపున మరొకరు పోటీ పడుతుండగా.. వీరిద్దరి పేర్లు 'బీసోళ్ల సంధ్యారాణి' కావడం విశేషం. వీరి భర్తలు వరుసకు అన్నదమ్ములు కావడం గమనార్హం. ఒకే పేరు, ఒకే ఇంటిపేరు ఉండటంతో ఓటర్లు తికమకపడే అవకాశం ఉందని భావించిన అభ్యర్థులు, పేర్ల కంటే పార్టీ గుర్తును చూసి ఓటు వేయాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా స్థానిక రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్న ఈ ఇద్దరు తోడికోడళ్ల మధ్య జరుగుతున్న ఈ పోరు ఇప్పుడు నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.




# ఏ జిల్లానూ రద్దు చేయం

**మొదటిపేజీ తరువాయి**

కొంతమంది విషపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు చిల్లర మల్లర ప్రయత్నాలు, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని అపోహలు సృష్టించాలని ప్రయత్నాలు చేసినా భూపలపల్లి జిల్లా ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. ఈ వేదిక నుంచి అపోహలపైరాష్ట్రంలోని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు వివరణ ఇస్తున్నానని సీఎం తెలిపారు. కుట్రలు, కుతంత్రాలతో విష ప్రచారాలు చేస్తున్న పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో సీఎం పర్యటించారు. అక్కడ ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం 'ప్రజాపాలనప్రగతి బాట' సభలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీ లు వేరు వేరు కాదన్న సీఎం.. ఆయా పార్టీలు బొమ్మ, బొరుసులా.. బిల్లా రంగ లా.. కాంగ్రెస్ ను ఓడించాలని ప్రయత్నం చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. ఆయా పార్టీల కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ ల కుట్రలకు దెబ్బకు దెబ్బ కొడతామన్న సీఎం... మీ తాతలు, ముత్తాతలను తీసుకువచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు మీసంగతి చూస్తారని హెచ్చరించారు. ఆడబిడ్డల ఆశీర్వాధం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తామన్నారు. ఎవరికి వారు తనను వాళ్లు తమ సామాజిక వర్గం పేరుతో పిల్చుకుంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఎవరు ఎలాంటి పేరుతో పిలిచినా తాను సంతోషిస్తానని చెప్పారు.

తెలంగాణ లో మున్సిపాలిటీలు, కార్పేరేషన్ల కు 17,442 కోట్లు మంజూరు చేశామన్న సీఎం.. వీటిలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీ లకు రూ. 6116 కోట్లు ఇచ్చామన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ. 92 కోట్ల నిధులు మంజూరు చేశామని వివరించారు. సరస్వతి పుష్కరాలు అద్భుతంగా నిర్వహించుకున్నామన్నసీఎం... వచ్చే ఏడాది జరగనున్నగోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు రూ. 4వేల కోట్లు ఖర్చు పెట్టి గోదావరి పరిహాకప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రూ. 22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున 4.5 లక్షల ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని సీఎం వివరించారు. వచ్చే బడ్జెట్ లో పేదల ఆత్మగౌరవం పెరిగేలా, ఆడబిడ్డలు ఆశీర్వదించేలా రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ సాధణలో తొలి, మలిదశ ఉద్యమాల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల పాత్ర కీలకం అని సీఎం అన్నారు. నల్లబంగారాన్ని వెలికి తీస్తున్న సింగరేణి కార్మికులు దేశానికి ఆదర్శం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. భూపాలపల్లి కుగ్రామంగా ఉన్న సమయంలో అన్న నందమూరి తారకరామరావు మొట్టమొదట దీన్ని మండల కేంద్రంగా మార్చి సింగరేణి బొగ్గు ఉత్పత్తికి మొట్టమొదటి పునాది రాయి వేశారనీ దాంతో ఆ తర్వాత భూపాలపల్లి వెనక్కి తిరిగి చూడలేదన్నారు. ఇప్పుడు భూపాలపల్లి జిల్లా కేంద్రంగా, మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిందన్నారు.

**మెడికల్ బోర్డు ఆలోచన లేదు:**

సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డు విషయంలో విపక్ష పార్టీ నేతలు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇలాంటి వారిని మోకాళ్లపై కూర్చొబెడుతామని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెడికల్ బోర్డు ఆలోచన ప్రభుత్వ ఆలోచనలో లేదన్నారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. అలాంటి సింగరేణి కార్మికులకు నష్టం చేసే ఏ పనిని ఈ ప్రభుత్వం చేయదన్నారు. డిస్మిస్ కార్మికులు 217 మంది ఉన్నారని నా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు.




**ఆ ముగ్గురిని అరెస్ట్ చేసేంత వరకు నువ్వు కిషన్ రావే..**

కిషన్ రెడ్డి.. ముమ్మాటికీ కేసీఆర్ కు దత్తపుత్రుడేనని సీఎం పునరుధ్ఘాటించారు. కల్వకుంట్ల కిషన్ రావు గా మారిన కిషన్ రెడ్డి... కాళేశ్వరం అవినీతి కేసులో కేసీఆర్ ను అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. దీనిపై తాను నిలదీస్తే... కేసీఆర్ ను అరెస్ట్ చేయడానికి నేను ఏమైనా సీఎం నా అని కిషన్ రెడ్డి అంటున్నారని చెప్పారు. నల్లికుంట్ల మాటలు మాట్లాడుతున్న కిషన్ రెడ్డి... తనఫెవికాల్ బంధంతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను కంచె వేసి కాపాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీస్ రావును అరెస్టు చేసే వరకు కిషన్ రెడ్డిని కల్వకుంట్ల కిషన్ రావు అనే పిలుస్తానన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ను కాపాడుతుంది మీరు కాదా అని రేవంత్ రెడ్డి నిలదీశారు. రూ.వేలకోట్ల ఆస్తులను పేదల కోసం దానం చేసిన సోనియా, రాహుల్ గాంధీ ని కేసుల పేరుతో సీబీఐ, ఈడీ పేరుతో తిప్పించి అమానించలేదా..? అని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. గాంధీ కుటుంబాన్ని మానసిక క్షోభ కల్గించిన మీకు ఉసురు తగులుతుందన్నారు. ఇప్పటికీ రాహుల్ గాంధీని ఈడీ, సీబీఐ కేసులతో వేధిస్తున్నారని సీఎం మండిపడ్డారు. గాంధీ కుటుంబం పై ఈడీ , సీబీఐ ని ఉపయోగిస్తున్నప్పుడు కాళేశ్వరం పైన సీబీఐ విచారణకు పంపిస్తే ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. 10 ఏళ్లు కేసీఆర్ సీఎం గా, మూడు సార్లు మోదీ ప్రధానిగా ఉన్నారన్న ఆయన రాష్ట్రానికి ఎలాంటి మేలు చేకూర్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు సీఎంగా ఉండి భూపాలపల్లి కి బై పాస్ రోడ్డు తీసుకురాలేదని మండిపడ్డారు. ఎర్రవెల్లి పామ్ హౌస్ లో బోర్లా బొక్కలా పడుకున్న కేసీఆర్ మీకు నిధులు ఇవ్వరని ప్రజలకు చెప్పారు. కేసీఆర్ ఇంటిల్లిపాలికి పదవులు ఇచ్చుకున్నడు..కాని పేదలకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. ప్రధాని మోడి కూడా.. ఏనాడు భూపాలపల్లికి రాలేదన్నారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతారు జాగ్రత్త అని ఓటర్లను అప్రమత్తం చేశారు. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే సంసారం ఆగం అవుతుందన్న సీఎం.. కాంగ్రెస్ కు ఓటేస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ తీరు తిక్కలోడు తిరునాళ్లకు పోయినట్లుందని సీఎం ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపిస్తే గండ్ర వెంకటరమణారెడ్డి కేసీఆర్ సంకన చేరారని విమర్శించారు.

# పోలీసు వృత్తి సామాజిక బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందిస్తూ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ప్రసంగం చేశారు. పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తి చేయడం కంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే అసలైన విజయమని స్పష్టం చేశారు. విధులకు అతీతంగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు.

సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. విధులకు అతీతంగా సమాజానికి మేలు చేసే ప్రతి పోలీసు అధికారిని ఈ వేదిక గౌరవిస్తుందని చెప్పారు. ఇది కేవలం ఒక అవార్డు మాత్రమే కాదని, అంకితభావానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. ఈ గుర్తింపు పోలీసుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని, ఇతరులు నిబద్ధతతో పనిచేసేలా ప్రేరణనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ఎంత పురోగమించినా, క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది చూపే చిత్తశుద్ధికి, ఆపదలో ఉన్న వారి పట్ల ప్రదర్శించే మానవత్వానికి ఏ టెక్నాలజీ సాటిరాదని గుర్తు చేశారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఒకే బృందంగా పనిచేయడం వల్లే నగరంలో శాంతిభద్రతలు సమర్థంగా ఉన్నాయని కొనియాడారు.

**ప్రతి నెల జోనల్ స్థాయిలో..**

ఈ పురస్కారాలు ఇక్కడితో ఆగిపోవని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేందుకు ఇకపై ప్రతి నెల జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది కృషి, నిజాయితీ వృథా కాదని, కష్టానికి తగ్గ గుర్తింపు కచ్చితంగా ఉంటుందన్నారు. కాగా, గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్ ట్రా మైల్ లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్ వర్క్ డన్ లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి. పురస్కారాలు అందుకున్న వారిలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు.



## పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు.**

**వనపర్తి,ఫిబ్రవరి 8 (ప్రజాస్వరం):**

మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి లోపాలు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి మున్సిపల్ కార్యాలయం, కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు పలు సూచనలు చేశారు.



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరుని ప్రభుత్వం సూచించిన గుర్తింపు కార్డుల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన ఓటర్ల వివరాలను ఓటరు జాబితాలో స్పష్టంగా గుర్తు పెట్టాలని, అలాగే ఓటు వేసిన ప్రతి ఓటరికి నిబంధనల ప్రకారం తప్పనిసరిగా సిరా చుక్క వేయాలని ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ మొత్తం అత్యంత పారదర్శకంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పూర్తయ్యాక నమోదైన ఓట్ల వివరాలను సంబంధిత అభ్యర్థులకు లేదా వారి ఎన్నికల ఏజెంట్లకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్యతో పాటు ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు,ఎంపీడీవోలు, తహసిల్దారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీ పరీక్షలు రాసేందుకు ఉత్సాహంగా ముందుండాలి

- **వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు**

**వలిగొండ, ఫిబ్రవరి 8(ప్రజాస్వరం):**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ పరీక్షల పట్ల భయం వీడెందుకు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు బయటికి తీసేందుకు పదవ తరగతి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని ఈ పోటీ సమాజంలో ముందుండాలన్నారు మరియు వలిగొండ మండలంలో విజయవంతంగా సాగిన ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పరీక్షలు రెండు వందల మందికి పైగా పాల్గొని విజయవంతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మండల అధ్యక్షులు మైసొల్ల నరేందర్ జిల్లా నాయకులు బుగ్గ ఉదయ్ కుమార్,ఎండి ఫర్దిన్, బోనగిరి సాయి, సల్మాన్, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.






# ఇంగ్లండ్ కు చెమటలు పట్టించిన నేపాల్

- చివరి బంతికి గట్టెక్కిన ఇంగ్లాండ్
- పోరాడి ఓడిన నేపాల్

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్



టీ20 ప్రపంచకప్‌లో పసికూన నేపాల్ సంచలన విజయం అంచుల దాకా వెళ్లి చివరి క్షణంలో చేజార్చుకుంది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత గ్రూప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో నేపాల్ 4 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది.185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 20 ఓవర్లలో 180/6కే పరిమితమైంది. దీపేంద్ర సింగ్ (44), రోహిత్ (39), లోకేశ్ బామ్ (39*) కీలకంగా ఆడగా, మూడో వికెట్‌కు దీపేంద్ర-రోహిత్ జోడీ 82 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. చివరి బంతికి ఆరు పరుగులు అవసరమైన వేళ ఒక్క పరుగు మాత్రమే రావడంతో నేపాల్ ఆశలు ఆవిరయ్యాయి.

అంతకుముందు ఇంగ్లాండ్ 20 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. జాకబ్ (55), బ్రూక్ (53) అర్ధశతకాలతో మెరిశారు. బౌలింగ్‌లో లియామ్ రెండు వికెట్లు తీయగా, జోఫ్రా, విల్ జాక్స్, సామ్ కరన్, ల్యూక్ చెరో వికెట్‌తో ఇంగ్లాండ్‌కు విజయం అందించారు. నేపాల్ పోరాటం అభిమానుల ప్రశంసలు దక్కించుకుంది.

# సూర్య పోరాటం, అశ్విన్ ప్రశంసలు..

**భారత్‌కు హెచ్చరికగా యూఎస్‌ఏ మ్యాచ్**

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్ :

టీ20 ప్రపంచకప్‌లో యూఎస్‌ఏతో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ భారత జట్టును కష్టాల నుంచి బయటపడేశాడు. 49 బంతుల్లో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచి, 77/6 నుంచి భారత్‌ను 161 పరుగుల వరకు తీసుకెళ్లాడు. జట్టు స్కోర్‌లో సగానికి పైగా పరుగులు సూర్య బ్యాట్ నుంచే రావడం విశేషం. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ, గత ఏడాది ఫామ్ కోల్పోయిన సూర్య తిరిగి పాత లయను అందుకున్నాడని కొనియాడాడు. వికెట్ల వెనుక నుంచి పరుగులు రాబట్టడం ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నాడు. డెత్ ఓవర్లలో సూర్య చూపిన దూకుడు నిజమైన 360 డిగ్రీ బ్యాటింగ్‌కు ఉదాహరణగా అభివర్ణించాడు.

అయితే సూర్య ఇన్నింగ్స్‌ను పక్కనపెడితే, ఈ మ్యాచ్ భారత జట్టుకు హెచ్చరికగా మారిందని అశ్విన్ వ్యాఖ్యానించాడు. పవర్‌ప్లేలో నాలుగు వికెట్లు కోల్పోవడం ఆందోళనకరమన్నాడు. పిచ్ స్వభావాన్ని తొలినాళ్లలోనే అర్థం చేసుకుని ఆడితే భారత్ మరో 20-30 పరుగులు అదనంగా సాధించేదని అభిప్రాయపడ్డాడు. అయినప్పటికీ 161 పరుగులను కాపాడుకోవడం భారత్ సాధించిందని గుర్తు చేశాడు.



మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడుతూ, గత ఏడాది తనకు మానసికంగా కష్టంగా గడిచిందని, కొంత విరామం తీసుకోవడం మళ్లీ ఫామ్‌లోకి రావడానికి సహాయపడిందని తెలిపాడు.

# తొలి బంతికే వికెట్...

**టీ20 వరల్డ్‌కప్‌లో నేపాల్ బౌలర్ షేర్ మల్లా అరుదైన రికార్డు**

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్

నేపాల్ ఆఫ్‌బ్రేక్ బౌలర్ షేర్ మల్లా క్రికెట్ చరిత్రలో తన పేరు లిఖించుకున్నాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో తొలి బంతికే వికెట్ పడగొట్టి అరుదైన ఘనతను సాధించాడు. ఈ రికార్డు సాధారణ మ్యాచ్‌లో కాకుండా, టీ20 వరల్డ్‌కప్ లాంటి మెగా టోర్నీలో నమోదు కావడం విశేషంగా మారింది.

మల్లాకు ముందు వరల్డ్‌కప్‌లో కెరీర్ తొలి బంతికే వికెట్ తీసిన ఘనత కేవలం ఐదుగురికే దక్కింది. ఫిడేల్ ఎడ్వర్డ్స్, ప్రగ్యాన్ ఓఝా, పరాస్ ఖడ్కా, నదీమ్ అహ్మద్, ఖుర్రమ్ ఖాన్ ఈ జాబితాలో ఉన్నారు. వీరిలో ఇప్పటికే నేపాల్‌కు చెందిన పరాస్ ఖడ్కా ఉండటం గమనార్హం. అంతేకాదు, మల్లాకు ముందు పరాస్ ఖడ్కా, ఆరిఫ్ షేక్, కుశాల్ భుర్టెల్ కూడా తమ కెరీర్ తొలి బంతికే వికెట్ తీసిన నేపాల్ ఆటగాళ్లుగా గుర్తింపు పొందారు.

ఇదిలా ఉండగా, టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా ఫిబ్రవరి 8న ముంబై వేదికగా నేపాల్-ఇంగ్లండ్ మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. జేకబ్ బేతెల్ (55), హ్యారీ బ్రూక్ (53) అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకోగా, చివర్లో విల్ జాక్స్ (38 నాటౌట్) వేగంగా పరుగులు సాధించాడు.

మిగతా బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 1, జోస్ బట్లర్ 26, టామ్ బాంటన్ 2, సామ్ కర్రన్ 2, జోఫ్రా ఆర్చర్ 1 పరుగు మాత్రమే చేశారు. నేపాల్ బౌలర్లలో నందన్ యాదవ్, దీపేంద్ర సింగ్ ఎయిరీ తలో రెండు వికెట్లు తీయగా, షేర్ మల్లా, సందీప్ లామిచ్చానే చెరో వికెట్ సాధించారు. మల్లా తీసిన తొలి వికెట్ ఫిల్ సాల్ట్‌ది.

185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 7 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. భుర్టెల్ (29), ఆసిఫ్ షేక్ (7) ఔటవ్వగా, రోహిత్ పౌడెల్ (10), దీపేంద్ర సింగ్ ఎయిరీ (10) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో డాసన్, జాక్స్ చెరో వికెట్ తీశారు. ఈ దశలో నేపాల్ విజయం సాధించాలంటే మిగిలిన 78 బంతుల్లో 125 పరుగులు చేయాల్సి ఉంది.




# భారత్‌తో మ్యాచ్‌పై పాక్ వెనకడుగు? ఐసీసీ జోక్యంతో మారుతున్న వైఖరి

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్

క్రికెట్‌లో రాజకీయాల్ని కలపడం పాకిస్థాన్‌కు కొత్త కాదు. టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా శ్రీలంకలో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను కారణం లేకుండా తప్పించుకోవాలన్న పాక్ ప్రయత్నాలు ఇప్పుడు ఐసీసీ దృష్టికి వెళ్లాయి. ఈ అంశంపై స్పష్టత తీసుకురావాలనే ఉద్దేశంతో ఐసీసీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మధ్య వర్చువల్ సమావేశం జరగనుంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ అమిన్ ఉల్ ఇస్లామ్ కరాచీ చేరుకుని పీసీబీ ఛైర్మన్ నక్వీతో భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఆయన కూడా ఐసీసీ-పీసీబీ చర్చల్లో పాల్గొనే అవకాశముందని సమాచారం.

షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్, పాకిస్తాన్ జట్లు తలపడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాక్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై పాక్ ప్రభుత్వం ఆదేశాలున్నాయంటూ పీసీబీ స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోంది. మరోవైపు, భారత్‌తో మ్యాచ్‌ను బాయికాట్ చేయవద్దని శ్రీలంక క్రికెట్ బోర్డ్ ఇటీవల పాక్‌కు లేఖ రాసింది. ఆ తర్వాత పాక్ వైఖరిలో స్వల్ప మార్పు కనిపిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిర్ణయాలనే సాకుగా చూపుతూ, యుద్ధం లేదా ప్రకృతి విపత్తుల వంటి సందర్భాల్లో వర్తించే 'ఫోర్స్ మెజ్యూర్' నిబంధన కింద మినహాయింపు ఇవ్వాలని పాక్ ఐసీసీని కోరిందని తెలుస్తోంది. కానీ వాస్తవ పరిస్థితులు అలాంటివి కాకపోవడంతో ఐసీసీ ఈ వాదనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సరైన కారణాలు చూపకపోతే కఠిన చర్యలు తప్పవని పీసీబీకి స్పష్టంగా హెచ్చరించినట్లు సమాచారం.

ఈ పరిణామాల నేపథ్యంలో పాక్ ధోరణి కాస్త సాఫ్ట్ అయినట్లు తెలుస్తోంది. భారత్‌తో మ్యాచ్ ఆడే అవకాశం పెరిగిందని ఐసీసీ వర్గాలే సంకేతాలు ఇస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కొలంబో వెళ్లి శ్రీలంక క్రికెట్ బోర్డ్ అధ్యక్షుడు షమ్మీ సిల్వాతో సమావేశమయ్యారన్న వార్తలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





# భారత్‌లో తొలిసారి కిక్‌బాక్సింగ్ సూపర్ లీగ్...

# క్రీడకు కొత్త ఊపిరి

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్

భారత్‌లో కిక్‌బాక్సింగ్‌ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తొలిసారిగా కిక్‌బాక్సింగ్ సూపర్ లీగ్ (కేఎస్ఎల్) ప్రారంభం కానుంది. దిల్లీలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ లీగ్‌ను అధికారికంగా ప్రకటించారు. వాకో ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్న సందర్భంలోనే కేఎస్ఎల్‌కు శ్రీకారం చుట్టడం విశేషంగా నిలిచింది. దేశంలో కిక్‌బాక్సింగ్‌కు గుర్తింపు పెంచడం, క్రీడాకారులకు స్థిరమైన అవకాశాలు కల్పించడం ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. నిర్మాణాత్మక పోటీలు, అథ్లెట్లకు ఒప్పందాలు, ప్రతిభకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వేదిక కల్పించడమే లక్ష్యంగా ఈ లీగ్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. సీజన్-1లో మొత్తం ఎనిమిది ఫ్రాంఛైజీ జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో జట్టులో 34 మంది ఫైటర్లు ఉండగా, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. మొత్తం క్రీడాకారుల్లో 60 శాతం పురుషులు, 40 శాతం మహిళలు ఉండనుండగా, 20 శాతం వరకు అంతర్జాతీయ అథ్లెట్లకు అవకాశం కల్పించనున్నారు. ఈ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి రూ.కోటి నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

కేఎస్ఎల్ సహవ్యవస్థాపకుడు అజయ్ అడ్లఖ మాట్లాడుతూ, లీగ్‌ను పారదర్శకంగా, పటిష్ఠమైన విధానాలతో నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా క్రీడాకారులు, జట్లు, భాగస్వాములందరికీ లాభం చేకూరుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ క్రీడాశాఖ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లీగ్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంపిక శిబిరాల ద్వారా అథ్లెట్లను ఎంపిక చేస్తారు. చివరగా క్రీడాకారుల వేలం నిర్వహించి, జట్ల యాజమాన్యాలతో సీజన్‌వారీ కాంట్రాక్టులు కుదుర్చుకుంటారు.




# అమెరికా పోరాటం—సూర్య ప్రశాంతత

- టీమిండియా విజయంపై సచిన్ ప్రశంసలు

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్

వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో టీమిండియా గెలిచినా, ఆ విజయం అంత సులువు కాదు. అమెరికా బౌలర్లు కట్టుదిట్టమైన ప్రణాళికతో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టగా, ఓ దశలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. అలాంటి సమయంలో సూర్యకుమార్ యాదవ్ తన అనుభవం, నిగ్రహంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతడి నాయకత్వ ఇన్నింగ్స్‌నే మ్యాచ్ దిశను మార్చింది.

ఈ మ్యాచ్‌పై క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన సచిన్, అమెరికా జట్టు చూపిన పోరాటపటిమను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. పెద్ద వేదికపై కొత్త జట్లు ఇంత ధైర్యంగా ఆడితే క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తుందన్నారు. అమెరికా ఆటగాళ్ల ఉత్సాహం, పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అలాగే సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌పై సచిన్ ప్రత్యేక ప్రశంసలు చేశారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడి జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడని కొనియాడారు. ఆ తర్వాత భారత బౌలర్లు బాధ్యతను సమర్థంగా నెరవేర్చారని తెలిపారు. టోర్నీని విజయంతో ప్రారంభించడం ఎప్పుడూ శుభసూచకమని సచిన్ అభిప్రాయపడ్డారు.





# పంజాబ్ వీధుల నుంచి ప్రపంచకప్ వరకు..

- ఉబెర్ డ్రైవర్‌గా మొదలై ఇటలీ జెర్సీ ధరించిన జస్ప్రీత్ సింగ్

ప్రజాస్వరం. స్పోర్ట్స్ డెస్క్

పంజాబ్‌లోని ఫగవాడ వీధుల్లో క్రికెట్ ఆడిన ఓ బాలుడు.. కటిక పేదరికం, వలస కష్టాలను దాటుకుని ఈరోజు ఇటలీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రపంచకప్ వేదికపై కనిపిస్తున్నాడు. జస్ప్రీత్ సింగ్ ప్రయాణం నిజంగా సినిమాకి ఏమాత్రం తీసిపోదు.

పదేళ్ల వయసులోనే కుటుంబంతో కలిసి ఉపాధి కోసం ఇటలీకి వలస వెళ్లిన జస్ప్రీత్, కొత్త భాష, కొత్త సంస్కృతి మధ్య జీవనం సాగించాడు. తల్లిదండ్రులు ఫ్యాక్టరీల్లో కూలీలుగా పనిచేస్తుండగా.. అతడు మాత్రం క్రికెట్‌పై తన ప్రేమను వదల్లేదు. ఇటలీలో సరైన మైదానాలు లేకపోయినా, ఎప్పుడో ఒక రోజు పెద్ద క్రికెటర్ కావాలనే కలను గుండెల్లో దాచుకున్నాడు.

క్రికెట్‌లో ముందుకెళ్లాలనే తపనతో జస్ప్రీత్ ఇంగ్లాండ్ చేరాడు. బర్మింగ్‌హామ్‌లో ఖర్చుల కోసం ఉబెర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, ఖాళీ సమయంలో టర్ఫ్ వికెట్లపై సాధన చేశాడు. అదే పట్టుదల అతడిని స్థానిక లీగ్‌లలో రాణించేలా చేసి, 2019లో ఇటలీ జాతీయ జట్టులో చోటు దక్కేలా చేసింది. తర్వాతి ఏడాదుల్లో నిరాశలు ఎదురైనా వెనకడుగు వేయని జస్ప్రీత్.. 2025 యూరోపియన్ క్వాలిఫైయర్స్‌లో ఇటలీని అగ్రస్థానంలో నిలిపి, 2026 టీ20 ప్రపంచకప్ టికెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.

**ప్రస్తుతంపంజాబ్ వీధుల నుంచి ప్రపంచకప్ వరకు.. ఉబెర్ డ్రైవర్‌గా మొదలై ఇటలీ జెర్సీ ధరించిన జస్ప్రీత్ సింగ్**


పంజాబ్‌లోని ఫగవాడ వీధుల్లో క్రికెట్ ఆడిన ఓ బాలుడు.. కటిక పేదరికం, వలస కష్టాలను దాటుకుని ఈరోజు ఇటలీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రపంచకప్ వేదికపై కనిపిస్తున్నాడు. జస్ప్రీత్ సింగ్ ప్రయాణం నిజంగా సినిమాకి ఏమాత్రం తీసిపోదు.

పదేళ్ల వయసులోనే కుటుంబంతో కలిసి ఉపాధి కోసం ఇటలీకి వలస వెళ్లిన జస్ప్రీత్, కొత్త భాష, కొత్త సంస్కృతి మధ్య జీవనం సాగించాడు. తల్లిదండ్రులు ఫ్యాక్టరీల్లో కూలీలుగా పనిచేస్తుండగా.. అతడు మాత్రం క్రికెట్‌పై తన ప్రేమను వదల్లేదు. ఇటలీలో సరైన మైదానాలు లేకపోయినా, ఎప్పుడో ఒక రోజు పెద్ద క్రికెటర్ కావాలనే కలను గుండెల్లో దాచుకున్నాడు.

క్రికెట్‌లో ముందుకెళ్లాలనే తపనతో జస్ప్రీత్ ఇంగ్లాండ్ చేరాడు. బర్మింగ్‌హామ్‌లో ఖర్చుల కోసం ఉబెర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, ఖాళీ సమయంలో టర్ఫ్ వికెట్లపై సాధన చేశాడు. అదే పట్టుదల అతడిని స్థానిక లీగ్‌లలో రాణించేలా చేసి, 2019లో ఇటలీ జాతీయ జట్టులో చోటు దక్కేలా చేసింది.

తర్వాతి ఏడాదుల్లో నిరాశలు ఎదురైనా వెనకడుగు వేయని జస్ప్రీత్.. 2025 యూరోపియన్ క్వాలిఫైయర్స్‌లో ఇటలీని అగ్రస్థానంలో నిలిపి, 2026 టీ20 ప్రపంచకప్ టికెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.


ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో ఆడటం జస్ప్రీత్‌కు భావోద్వేగ క్షణం. చిన్నప్పుడు టీవీలో చూసిన వాంఖడే, ఈడెన్ గార్డెన్స్ వంటి మైదానాల్లో దిగడం తన జీవితంలో అతిపెద్ద విజయమని చెబుతున్నాడు. ఉబెర్ డ్రైవర్ స్థాయి నుంచి ప్రపంచకప్ ఆటగాడిగా ఎదిగిన జస్ప్రీత్ సింగ్.. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.





భారత్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో ఆడటం జస్ప్రీత్‌కు భావోద్వేగ క్షణం. చిన్నప్పుడు టీవీలో చూసిన వాంఖడే, ఈడెన్ గార్డెన్స్ వంటి మైదానాల్లో దిగడం తన జీవితంలో అతిపెద్ద విజయమని చెబుతున్నాడు. ఉబెర్ డ్రైవర్ స్థాయి నుంచి ప్రపంచకప్ ఆటగాడిగా ఎదిగిన జస్ప్రీత్ సింగ్.. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
09.02.2026
సోమవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com








# హీరోయిన్ల నెంబర్ గేమ్ మాయమైందా?

ఒక సినిమాను నిలబెట్టే బాధ్యత హీరోదే కాదు... కథానాయిక పాత్ర కూడా అంతే కీలకం. కొన్ని చిత్రాల్లో హీరోయిన్ పాత్ర కథను ముందుకు నడిపిస్తే, మరికొన్నింట్లో ఆమెకు పాటలు, గ్లామర్‌కే పరిమితమైన స్థానం దక్కుతుంది. స్టార్ హీరోల సినిమాల్లో కథానాయికలను కేవలం అలంకారంగా ఉపయోగిస్తున్నారనే విమర్శలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. అయితే కమర్షియల్ సినిమాల్లోనూ అప్పుడప్పుడూ హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత దక్కిన ఉదాహరణలు లేకపోలేదు .v కథానాయిక కెరీర్ పూర్తిగా ఆమెకు దక్కిన అవకాశాలను ఎలా వినియోగించుకుంటుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆమె ఎంచుకునే కథలు, పాత్రలే కెరీర్ గ్రాఫ్‌ను నిర్ణయిస్తాయి. ఒకప్పుడు టాలీవుడ్‌లో హీరోయిన్ల మధ్య 'నెంబర్ వన్' పోటీ పెద్ద చర్చగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ నెంబర్ గేమ్ అసలు వినిపించడమే లేదు. వరుసగా రెండు విజయాలు వస్తే టాప్ అంటారు... అదే రెండు ఫ్లాప్‌లు పడితే వెంటనే వెనక్కి నెట్టేస్తున్నారు. కొన్నాళ్లు తెలుగు పరిశ్రమను ఏలిన అనుష్క, కాజల్, సమంత, తమన్నా లాంటి భామలు ఇప్పుడు లీడ్ రేస్‌కు దూరంగా ఉన్నారు. ఇటీవల వరకు టాప్ ప్లేస్‌లో ఉన్నట్లు కనిపించిన రష్మిక కూడా బాలీవుడ్ వైపు దృష్టి పెట్టడంతో టాలీవుడ్‌లో ఆ స్థానం ఖాళీ అయినట్టే. దీంతో కొత్త కథానాయికలకు అవకాశాలు మరింతగా తెరుచుకుంటున్నాయి. భాగ్యశ్రీ, శ్రీలీల, రుక్మిణి వసంత్ లాంటి కొత్త తరం హీరోయిన్లు ప్రస్తుతం మంచి బజ్ క్రియేట్ చేస్తున్నా... వీరిలో ఎవరు నిజంగా టాప్ రేంజ్‌కు చేరుతారన్నదానిపై స్పష్టత లేదు. ఎందుకంటే వరుస విజయాలు సాధించినా ఒక్కటి రెండు సినిమాలు నిరాశపరిస్తే చాలు, అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొత్త ముఖాలకు అవకాశాలు దక్కేందుకు కారణమవుతోంది. మొత్తానికి టాలీవుడ్‌లో కథానాయికల కొరత ఎప్పటికీ ఉండే అంశమే. గరిష్టంగా ఐదు నుంచి ఆరు సంవత్సరాలు స్టార్ ఫామ్ కొనసాగించగలిగినా, ఆ తర్వాత గ్రాఫ్ పడిపోవడం సాధారణంగా మారింది. అయితే కొద్దిమంది మాత్రమే క్రమబద్ధమైన కెరీర్ ప్లానింగ్‌తో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించే స్థాయికి చేరుతున్నారు. గ్లామర్‌తో పాటు పాత్రలకు ప్రాధాన్యత ఇచ్చుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే దీర్ఘకాలిక కెరీర్ సాధ్యమవుతుందన్నది నేటి టాలీవుడ్ రియాలిటీ.



## బుట్టబొమ్మకు షాకిచ్చిన బుడ్డోడు

- మోనికా సాంగ్‌ను అచ్చుగుద్దేశాడు

బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించిన కూలీ సినిమాలోని 'మోనికా' పాటకు ఓ చిన్నారి వేసిన డ్యాన్స్ స్టెప్పులు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల తమిళనాడులో నిర్వహించిన ఓ కార్యక్రమానికి పూజా హెగ్డే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానుల అభ్యర్థన మేరకు ఆమె వేదికపైకి వచ్చి 'మోనికా' పాటకు సరదాగా డ్యాన్స్ చేశారు. అదే సమయంలో స్టేజ్‌పైకి వచ్చిన ఓ బుడతడు అందరి దృష్టిని ఒక్కసారిగా తనవైపు తిప్పేశాడు. చిన్న వయసులోనే అద్భుతమైన ఎనర్జీతో, చక్కటి టైమింగ్‌తో చేసిన అతడి స్టెప్పులు అక్కడున్న వారిని మాత్రమే కాదు... పూజా హెగ్డేను కూడా ఆశ్చర్యపరిచాయి. ఆమె కూడా నవ్వుతూ అతడి డ్యాన్స్‌ను ఎంజాయ్ చేసిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ సరదా ఘట్టానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా షేర్ అవుతూ, చిన్నారి టాలెంట్‌పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



## అనుదీప్... నువ్వు మారలేదు

**ఆకట్టుకుంటున్న ఫంకీ ట్రైలర్**

విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎంటర్‌టైనర్ ఫంకీపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జాతిరత్నాలుతో ప్రేక్షకుల నవ్వులు కొల్లగొట్టిన డైరెక్టర్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా, పేరు చెప్పినట్టే ఫుల్ ఫంకీగా థియేటర్లలో హంగామా చేయడానికి సిద్ధమైంది. ఈ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రేమికుల దినోత్సవ కానుకగా ఈ నెల 13న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే టీజర్, పాటలతో అంచనాలు పెంచిన మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ స్టార్ట్ అయిన క్షణం నుంచే అనుదీప్ తన ట్రేడ్‌మార్క్ కామెడీతో దంచేశాడు. పంచ్ డైలాగ్స్, వింత సిట్యుయేషన్స్, గలీజ్ హ్యూమర్‌తో ట్రైలర్ మొత్తం నాన్‌స్టాప్ నవ్వులు పూయిస్తోంది. "మీ అమ్మకు ఆపరేషన్ చేయాలంటే నాకు రాదు డాక్టర్" అనే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్, "ఓనర్‌కు రెంట్ కట్టుడు వంటివన్నీ నాకు గలీజ్ అనిపిస్తాయ్" అన్న హీరో కామెడీతో మరో లెవల్‌కు వెళ్తుంది. ఇక "మీ అమ్మ కోడలు అనడం, మా నాన్న అల్లుడు అనడం కూడా గలీజ్ అనిపిస్తాయ్" అంటూ హీరోయిన్ వేసిన పంచ్ అయితే ట్రైలర్‌కే హైలెట్‌గా మారింది. మొత్తానికి ఈసారి కూడా అనుదీప్ తన స్టైల్ మార్చలేదు... ప్రేక్షకుల నవ్వు కంట్రోల్ పోయేలా చేసే మటీరియల్‌ను ఫంకీలో ప్యాక్ చేసినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకు మరింత ఊపు ఇస్తుండగా, డైరెక్టర్ అనుదీప్ స్వయంగా ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారన్న టాక్ కూడా ఆసక్తి పెంచుతోంది. సారాంశం ఏంటంటే... వాలెంటైన్స్ డే వీక్‌లో లవ్ కాదు, లాఫ్ కావాలంటే ఫంకీ థియేటర్లలో ఖాయం!




## కొత్త అవకాశాలు చిక్కేనా?

టాలీవుడ్‌లో ప్రగ్యా జైస్వాల్ ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. దశాబ్దం క్రితం కంచె సినిమాతో బలమైన అరంగేట్రం చేసిన ఆమె, ఆ చిత్రానికి గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డు కూడా అందుకోవడంతో భవిష్యత్తు స్టార్‌గా గుర్తింపు పొందింది. అయితే ఆ తర్వాత వచ్చిన గుంటూరోడు, నక్షత్రం వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె కెరీర్ గతి కొంత మందగించింది. కొన్నేళ్ల విరామం అనంతరం 2021లో విడుదలైన అఖండతో తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. భారీ కమర్షియల్ చిత్రాన్ని కూడా ఆమె సక్సెస్‌ఫుల్‌గా హ్యాండిల్ చేయగలదని ఈ సినిమాతో నిరూపించింది. ఇటీవల డాకు మహారాజ్ సినిమాలో గర్భిణీ దొంగ పాత్రలో బలమైన నటనతో కనిపించి మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అయినప్పటికీ గత ఏడాది ఆమెకు ఒక్క సినిమా మాత్రమే రావడం, టాలీవుడ్‌లో ఇంకా స్థిరమైన అవకాశాల కోసం పోరాటం కొనసాగుతోందనే విషయాన్ని సూచిస్తోంది.



## శ్రీవారిని దర్శించుకున్న నిధి అగర్వాల్

సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయానికి చేరుకున్న ఆమె, సంప్రదాయ వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం నిధికి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం తర్వాత ఆలయ ప్రాంగణంలో ఆమెను చూసిన అభిమానులు సెల్ఫీల కోసం ఆసక్తి చూపగా, కొందరికి నిధి చిరునవ్వుతో సెల్ఫీలు ఇచ్చారు. ఆమె రాకతో తిరుమల ఆలయ ప్రాంతం కాసేపు సందడిగా మారింది.


## మార్చి నుంచి సెట్స్ లోకి మెగా ఎంట్రీ

సక్సెస్ జోరులో ఉన్న మెగాస్టార్ చిరంజీవి పెద్దగా బ్రేక్ తీసుకోకుండా మరో కొత్త సినిమాకు సిద్ధమవుతున్నారు. మార్చి నుంచే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రణాళికలను చిత్రబృందం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సంక్రాంతి కానుకగా విడుదలైన మన శంకరవరప్రసాదారు సినిమాతో ఘన విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఆ సినిమా షూటింగ్ దశలోనే మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాల్తేరు వీరయ్య దర్శకుడు బాబీ కొల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ప్రీప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసిన బాబీ, సినిమాను త్వరగా పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నారని టాక్. తండ్రి-కూతురు భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సమాచారం. కూతురు పాత్రకు మొదట కృతిశెట్టి పేరు వినిపించినప్పటికీ, తాజాగా సారా అర్జున్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండగా, ఒక సీనియర్ హీరోయిన్ పాత్రపై ఇప్పటికే చర్చ జరుగుతోంది. మరో హీరోయిన్ ఎంపికపై చిత్రబృందం ఇంకా కసరత్తు చేస్తోంది. వాల్తేరు వీరయ్య తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



## ఆ కొరతే దురందర్ వసూళ్లకు అడ్డు

- **అమీర్ ఖాన్**



గతేడాది బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దురంధర్ 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. డిసెంబర్ 5న విడుదలైన ఈ మూవీ దేశవ్యాప్తంగా రూ.1000 కోట్ల మార్క్ దాటి, బాలీవుడ్‌లో ఆ ఘనత సాధించిన తొలి సినిమాగా రికార్డ్ సృష్టించింది. ప్రస్తుతం దీనికి సీక్వెల్‌గా దురంధర్2 మార్చి 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో స్టార్ హీరో అమిర్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో థియేటర్ల కొరత వల్లే దురంధర్ వసూళ్లు పరిమితమయ్యాయని ఆయన అభిప్రాయపడ్డారు. చైనాలో లభించేంత స్క్రీన్‌లు మనదేశంలో ఉంటే ఈ సినిమా ఇంకా భారీ వసూళ్లు సాధించేదని అన్నారు. ప్రస్తుతం భారత్‌లో సుమారు 9 వేల స్క్రీన్‌లు మాత్రమే ఉండగా, చైనాలో లక్షకు పైగా స్క్రీన్‌లు ఉన్నాయని తెలిపారు. చైనాలో పెద్ద సినిమాలు బిలియన్ డాలర్ల వ్యాపారం చేయడానికి ఇదే ప్రధాన కారణమని అమిర్ ఖాన్ పేర్కొన్నారు. గతేడాది చైనీస్ చిత్రం నె ఝూ 2 అక్కడ 2 బిలియన్ డాలర్లు వసూలు చేయగా, భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన దురంధర్ దేశీయంగా సుమారు 115 మిలియన్ డాలర్లకే పరిమితమైందని వివరించారు. భారతదేశంలో స్క్రీన్‌ల సంఖ్య పెంచినప్పుడే సినిమాల వసూళ్లలో నిజమైన మార్పు వస్తుందని, ఇప్పటికీ ఒక్క థియేటర్ కూడా లేని జిల్లాలు చాలానే ఉన్నాయని అమిర్ ఖాన్ సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999